క్లుప్తంగా

వెంకటేశ్వరుడికి విశేష పూజలు



పొదలకూరు: కార్తీక మాసాన్ని పురస్కరించుకొని పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లో గల శ్రీలక్ష్మీ గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలను శనివారం నిర్వహించారు. స్వామివారు విశేషాలంకారంలో దర్శనమిచ్చారు. అనంతరం భక్తులకు ప్రసాదాలను అందజేశారు.

19న అంబళ్ల పూజ

పట్టణంలోని శ్రీలక్ష్మీ గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో అయ్యప్పస్వామి అంబళ్ల పూజను మంగళవారం సాయంత్రం 6.30కు నిర్వహించనున్నామని అయ్యప్పస్వామి భక్త మండలి నిర్వాహకులు తెలిపారు. ఐదు మండపాలను ఏర్పాటు చేసి స్వామికి 18 అభిషేకాలు, 18 కలశాలతో అంబళ్లపూజను నిర్వహించనున్నామని చెప్పారు. భక్తులు తరలిరావాలని కోరారు.

జైన మందిరంలో వీఎస్‌యూ విద్యార్థులు



వెంకటాచలం: కాకుటూరు సమీపంలోని జైన మందిరాన్ని విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) టూరిజం మేనేజ్‌మెంట్ విద్యార్థులు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా టూరిజం విభాగాధిపతి సుజాత మాట్లాడారు. జైన మందిరం ఎంతో చారిత్రాక ప్రాధాన్యం కలిగిందని పేర్కొన్నారు. అధ్యాపకుడు విక్రమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విశేషాలంకారంలో వెంకయ్యస్వామి



మనుబోలు: మండల పరిధిలోని బీసీ కాలనీ సమీపంలో గల వెంకయ్యస్వామి మందిరంలో విశేష పూజలను శనివారం నిర్వహించారు. పంచామృతాభిషేకం, ప్రత్యేక పుష్పాలంకరణ, పూజలను అర్చకుడు శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిపారు. అన్నప్రసాదాన్ని అందజేశారు. ఉభయకర్తలుగా కన్నా వెంకటేశ్వర్లు వ్యవహరించారు.

డిప్యూటీ కమిషనర్ తనిఖీ



కల్లుగీత కార్మికులతో మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్

బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని కల్లుగీత కార్మికుల సమస్యలను తెలుసుకునేందుకు అబ్కారీ నెల్లూరు డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసులు శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయనకు కల్లుగీత కార్మికులు వినతి పత్రాన్ని అందజేశారు. తమకు గతంలో ఇచ్చిన విధంగా నష్ట పరిహారం చెల్లించాలని, తాటిచెట్లు పెంచేందుకు భూమి కేటాయించాలని కోరారు. సీఐ కిశోర్, ఆశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక దీపోత్సవం



నెల్లూరు(బృందావనం) : బీవీనగర్‌లోని సాయిబాబా మందిరంలో భక్తి సేవాదళ్ ఆధ్వర్యంలో అరుణాచలేశ్వర మహాకార్తీక దీపోత్సవాన్ని శనివారం రాత్రి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, రాత్రి అరుణాచలేశ్వర మహాదీపం, లక్ష దీపార్చన కార్యక్రమాలను చేపట్టారు. తొలుత తిక్కన మహాకవి లలిత కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు ఆలూరు శిరోమణివర్మ- రమాదేవి దంపతులు కార్యక్రమాన్ని ప్రారంభించారు. మహా కార్తీక దీపోత్సవం ప్రాధాన్యతను ఆలూరు శిరోమణి శర్మ వివరించారు. కార్యక్రమంలో భక్తి సేవాదళ్ కన్వీనర్లు మురళీ, శ్రీకంఠం మనోహర్, బీజేపీ నేత రమేష్, రాజేష్, సంపత్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

కదలని చెత్త వాహనం

- చెడిపోయి 20 రోజుల పైనే..
- నిరుపయోగంగా షెడ్లు
- అధికారులు స్పందించాలని కోరుతున్న జనం



మూలనపడిన చెత్త వాహనం

ముత్తుకూరు: మండలంలోని ముత్తుకూరు మేజర్ పంచాయతీలో ఇంటింటా పేరుకుపోయే తడి, పొడిచెత్తను తరలించే వాహనం మూలనపడింది. 20 రోజులకుపైగా ఈ వాహనం తిరగకపోవడంతో ఇళ్ల ముందు చెత్త తొలగించే వారు కరువయ్యారు. పంచాయతీలోని బలిజపాళెం, చలివేంద్ర, బోడిస్వామికండ్రిగ, ఆర్‌అండ్‌ఆర్ కాలనీలు, దళితవాడలు, బీసీ కాలనీ, రాజీవ్‌కాలనీల్లో ఇళ్ల ముందు గృహిణులు తడి, పొడిచెత్తను వేరు చేసి ఉంచుతున్నారు. పంచాయతీ ద్వారా ఈ చెత్తను తొలగించి ప్రత్యేక వాహనం ద్వారా డంపింగ్ యార్డ్‌లకు తరలిస్తారు. అయితే ఈ వాహనం చెడిపోయింది. మరమ్మతులు చేయించకపోవడంతో చెత్త నిల్వ పెరుగుతోంది. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో దోమలు ఉత్పత్తి అవుతున్నాయి. అంటు వ్యాధులు ప్రబలే అవకాశముందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

మూతపడి..

తడి, పొడిచెత్తను నిల్వ చేసి సంపద సృష్టించే కేంద్రాలుగా ఐదేళ్ల క్రితం నిర్మించిన షెడ్లు (సాయిల్ మేనేజ్‌మెంట్ సెంటర్లు) ప్రస్తుతం నిరుపయోగంగా మారాయి. వీటిని నిర్వహించేందుకు నియమించిన గ్రీన్ అంబాసిడర్లు కూడా కనిపించడం లేదు. గ్రామ పంచాయతీ నిధుల ద్వారా నెలకు రూ.10,000ల జీతం ఇవ్వలేకపోవడమే కారణంగా తెలుస్తోంది. తడి, పొడిచెత్త వేరు చేసి తరలించే వారు లేకపోవడంతో చాలా పంచాయతీల్లో ఈ కేంద్రాలు మూతపడ్డాయి.



నిరుపయోగంగా ఉన్న షెడ్

రిపేరు చేయించాలి



ముత్తుకూరు మేజర్ పంచాయతీలో తడి, పొడిచెత్తను తరలించే వాహనం ఇటీవల చెడిపోయింది. దీంతో ఇళ్ల ముందు చెత్త తొలగించే పరిస్థితి లేకుండా పోయింది. వీటి నుంచి వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉంది. వెంటనే ఈ వాహనానికి రిపేరు చేయించాలి.

– గడ్డం అంకయ్య, సీపీఎం కార్యదర్శి

పట్టించుకోవడం లేదు



గ్రామ పంచాయతీల పరిధిలో గతంలో నిర్మించిన సంపద సృష్టించే కేంద్రాలు ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్నాయి. వీటి నిర్వహణ భారం కావడంతో అధికారులు పట్టించుకోవడం లేదు. మల్లూరుకు చెందిన షెడ్ వినియోగంలో లేదు.

– గవిని రంగనాథ్, మల్లూరు

ఇంజినీరింగ్ విద్యార్థులకు శిక్షణ



కొడవలూరు : నార్తురాజుపాళెంలోని వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల ఈసీఈ, ఈఈఈ, ట్రిపుల్–ఈ విభాగాలకు చెందిన ద్వితీయ సంవత్సర విద్యార్థులకు హైదరాబాద్‌కు చెందిన 'బ్రెయిన్ ఓ విజన్' సంస్థ ఆధ్వర్యంలో శనివారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. సీఎస్సీ అనుబంధ విభాగాల విద్యార్థులకు పైతాన్, ఈసీఈ, ఈఈఈ, ట్రిపుల్–ఈ విద్యార్థులకు పీసీబీ సిములేషన్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ డాక్టర్ పి.గుణశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులకు పాఠ్యాంశ ప్రణాళికలో లేని అంశాలను కూడా ఇలాంటి శిక్షణలో నేర్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఓ గిరీష్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న రాధారాణి

కోవూరు : మహిళా సాధికారత, బాలల అభివృద్ధి, బాల్య వివాహాల నిర్మూలన వంటి అంశాలపై అవగాహన కల్పించాలని హెచ్‌ఎం రాధారాణి అన్నారు. కోవూరులోని ఇనమడుగు గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పఠశాలలో బాలల అభివృద్ధిపై శనివారం అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బేటీ బచావో బేటీ బడావో, బాల్య వివాహాలను అరికట్టడం, రక్తహీనత వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించాలన్నారు.

'అపార్' లక్ష్యాలను పూర్తి చేయాలి



వివరాలను ఆరాతీస్తున్న రేణుక

పొదలకూరు: ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఆటోమేటెడ్ పర్మనెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్) లక్ష్యాలను పూర్తి చేయాలని ఎంఈఓ రేణుక సూచించారు. పాఠశాలల్లో అపార్ లక్ష్యాలను పరిశీలించేందుకు గానూ పలు ప్రైవేట్ పాఠశాలలను శనివారం తనిఖీ చేసిన అనంతరం ఆమె మాట్లాడారు. మండలంలో ఇప్పటి వరకు 58 శాతాన్నే పూర్తి చేశారని చెప్పారు. ఆధార్ కార్డులను సరిచేయించి లక్ష్యాలను పూర్తి చేసే దిశగా కృషి చేయాలని ఆయా పాఠశాలల యాజమాన్యాలకు సూచించారు.

ట్రాఫిక్ పద్మవ్యూహం



- బారులుదీరుతున్న వాహనాలు

పొదలకూరు: పట్టణంలో పెరుగుతున్న ట్రాఫిక్‌కు అనుగుణంగా రహదారుల్లేవు. వాహనాల రాకపోకలు ఇటీవలి కాలంలో పెరగడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. చుట్టుపక్కల ఉన్న మండలాల వాసులు నెల్లూరు నగరానికి వెళ్లాలంటే ప్రత్యామ్నాయ మార్గం లేక పట్టణం మీదుగానే వెళ్లాల్సి వస్తోంది. దీంతో ట్రాఫిక్ ఇబ్బందులు పెరుగుతున్నాయి. సిమెంట్ రోడ్డు నిర్మాణంతో ట్రాఫిక్ సమస్య కొంత వరకు తీరినా, రహదారిపై తోపుడు బండ్లు, ఇతర వాహనాలను అడ్డదిడ్డంగా నిలుపుతున్నారు. ట్రాఫిక్ సమస్యకు ఇదీ ఓ కారణమవుతోంది.

ఆటోడ్రైవర్ల ఇష్టారాజ్యం

ఆటోలు, కంకర లారీల తాకిడి అధికంగా ఉంది. ఆటోలను డ్రైవర్లు ఎక్కడపడితే అక్కడే నిలిపేస్తుండటంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో ట్రాఫిక్ సుమారు అర్ధగంట స్తంభిస్తోంది. ముఖ్యంగా బస్టాండ్ సెంటర్, రామ్‌నగర్ గేట్ సెంటర్, బ్యాంకుల సెంటర్‌లో సమస్య తీవ్రంగా ఉంది. నియంత్రణకు కానిస్టేబుళ్లను నియమించకపోవడంతో అంతా ఇష్టారాజ్యంగా సాగుతోంది.

రహదారుల విస్తరణే శరణ్యం

పట్టణంలో నాలుగు లేన్ల విస్తరణ పనులు జరుగుతాయని చాలా రోజుల క్రితం ప్రచారం జరిగింది. అయితే ఇది ఆచరణకు నోచుకోలేదు. దీనిపై అధికారులెవరూ స్పష్టత ఇవ్వడం లేదు. నెల్లూరు నుంచి పొదలకూరు మీదుగా సైదాపురం వరకు నాలుగు లేన్ల రోడ్డు విస్తరణ పనుల కోసం సర్వేను చేపట్టారు. అయినా కార్యరూపం దాల్చకపోవడం గమనార్హం.

సర్వేపల్లిలో రాజ్యమేలుతున్న అవినీతి



ముత్తుకూరు: బ్రహ్మదేవిలో కార్యకర్తలను పరామర్శిస్తున్న కాకాణి

- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

ముత్తుకూరు: సర్వేపల్లి నియోజకవర్గంలో ఎన్నడూ లేని విధంగా అవినీతి రాజ్యమేలుతోందే తప్ప, అభివృద్ధి జాడ కానరావడంలేదని మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి ధ్వజమెత్తారు. ముత్తుకూరు, బ్రహ్మదేవి గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. బ్రహ్మదేవిలో అనారోగ్యానికి గురైన పట్టపు కృష్ణయ్య.. తల్లిని కోల్పోయిన మెంటా సుబ్బయ్య కుటుంబీకులను పరామర్శించారు. ముత్తుకూరు ఆర్ అండ్ ఆర్ కాలనీలో వార్డు సభ్యులు మేనాటి లక్ష్మమ్మ భర్త నాగరాజు ఇటీవల మృతి చెందడంతో పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 2026లో సార్వత్రిక ఎన్నికలు జరిగే అవకాశం ఉందని, ఈ క్రమంలో పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. పార్టీ కన్వీనర్ మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు బందెల వెంకటరమణయ్య, ఎంపీపీ గండవరం సుగుణ పాల్గొన్నారు.

తోటపల్లిగూడూరు: మండలంలోని మాచర్లవారిపాళెం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత దువ్వూరు ప్రకాష్‌రెడ్డి, సర్పంచ్ దువ్వూరు కల్పన కుటుంబ సభ్యులను మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పరామర్శించారు. ప్రకాష్‌రెడ్డి తల్లి దువ్వూరు శేషమ్మ శుక్రవారం మృతి చెందడంతో వారి నివాసానికి కాకాణి వచ్చారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. నాయుడు సుధాకర్‌రెడ్డి, కాకు మనోహర్‌రెడ్డి, తిక్కవరపు గిరిరెడ్డి, కై లాసం శేఖర్‌రెడ్డి, మన్నెం సుబ్రహ్మణ్యంగౌడ్, మన్నెం చిరంజీవులుగౌడ్, నెలవాయి గోపి, చింతల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



తోటపల్లిగూడూరులో..

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- ఇన్‌స్పెక్టర్ అన్వర్‌బాషా



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అన్వర్‌బాషా

నెల్లూరు(క్రైమ్) : ప్రతిఒక్కరూ సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండడంతో పాటు అప్రమత్తంగా ఉండాలని నవాబుపేట ఇన్‌స్పెక్టర్ షేక్. అన్వర్‌బాషా విద్యార్థులకు సూచించారు. పప్పులవీధిలోని శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో సైబర్ నేరాలు, రోడ్‌సేఫ్టీ, మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే నష్టాలు తదితరాలపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. సైబర్ నేరాల్లో ప్రధానంగా కొరియర్ పేరుతో మోసాలు, డిజిటల్ అరెస్టులు, ఓటీపీ మోసాలు, లోన్‌యాప్స్, హనీట్రాప్, డెబిట్, క్రెడిట్ కార్డు మోసాలు అధికమయ్యాయన్నారు. స్మార్ట్‌ఫోన్లను మంచికి ఉపయోగించుకుంటే జీవితం సాఫీగా సాగి ఉన్నతంగా ఎదుగుతారన్నారు. సైబర్ నేరాలకు గురైతే వెంటనే డయల్ 1930 లేదా సైబర్‌క్రైమ్.జీఓవీ.ఇన్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. ఊర్లకు వెళ్లే సమయంలో లాక్డ్‌హౌస్ మానిటరింగ్ సిస్టం సేవలను వినియోగించుకోవాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అత్యవసర వేళల్లో 112కు కాల్‌చేస్తే పోలీసుల తక్షణ సాయం అందుతుందన్నారు. అనంతరం నూతన చట్టాల గురించి వివరించారు. కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

పక్కాగా సాగునీటి సంఘాల ఎన్నికలు



అవగాహన కల్పిస్తున్న మనోహర్‌బాబు



మనుబోలులో..

తోటపల్లిగూడూరు: సాగునీటి సంఘాల ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని మండల ఎన్నికల ప్రత్యేకాధికారి మనోహర్‌బాబు సూచించారు. ఎన్నికల నిర్వహణపై స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులకు శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మండల పరిధిలోని కోడూరు, వెంకన్నపాళెం, సౌత్‌ఆములూరు, వరిగొండ, మాచర్లవారిపాళెంలో సాగునీటి సంఘాలున్నాయని చెప్పారు. వీటికి గానూ ఎన్నికలను ఈ నెల 23న నిర్వహించనున్నారని పేర్కొన్నారు. నామినేషన్ల స్వీకరణ నుంచి ఎన్నికల ప్రక్రియ ముగిసేంత వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సాగునీటి సంఘాల ఎన్నికల్లో పోటీ చేసే రైతులు లేదా వారిని సూచించే రైతులు రెవెన్యూ శిస్తులను కచ్చితంగా చెల్లించి ఉండాలన్నారు.

మనుబోలు: మండలానికి సంబంధించిన సాగునీటి సంఘ ఎన్నికలకు సిబ్బంది, రైతులు సిద్ధంగా ఉండాలని తహసీల్దార్ సుబ్బయ్య సూచించారు. సాగునీటి సంఘ ఎన్నికల నిర్వహణపై పీఓలు, ఏపీఓలకు శిక్షణ కార్యక్రమాన్ని ఇరిగేషన్ డీఈ ప్రసన్న ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలో 15 నీటి సంఘాలకు గానూ ఓటర్లుగా 10,578 మంది ఉన్నారని తెలిపారు. ఎన్నికలను శాంతియుతంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని కోరారు. డీటీ బషీర్, ఎంపీడీఓ జలజాక్షి, వ్యవసాయాధికారి జహీర్, ఎంఈఓ రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేడదిబ్బల తొలగింపు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని నాగమాంబపురం పంచాయతీ సచివాలయం పక్కనే ఉన్న మార్గంలో పేరుకుపోయిన పేడదిబ్బలను ఎంపీడీఓ శ్రీహరి ఆదేశాలతో అధికారులు శనివారం తొలగింపు పనులు చేపట్టారు. ఎంతో కాలంగా అక్కడ చెత్త నిలువ ఉండడంతో తీవ్ర అసౌకర్యం కలుగుతోందని గ్రామస్తులు ఎంపీడీఓ దృష్టికి తీసుకెళ్లారు. ఇటీవల ఆయన గ్రామంలో పర్యటించి పేరుకుపోయిన చెత్తతో పాటు రోడ్లపై ఉన్న పేడదిబ్బలను తొలగించాలని అధికారులకు సూచించారు. పంచాయతీ కార్యదర్శి సింధూర జేసీబీ సాయంతో చెత్తకుప్పలు, పేడదిబ్బల తొలగింపు చేపట్టారు.



గ్రంథాలయ ఉద్యమకారులకు నివాళి



విడవలూరు : మాట్లాడుతున్న లైబ్రేరియన్ నిరూప



బుచ్చిరెడ్డిపాళెంలో..

విడవలూరు : గ్రంథాలయ ఏర్పాటులో ముఖ్యపాత్ర పోషించిన ఉద్యమకారులు ఎస్సార్ రంగనాథన్, పాతూరు నాగభూషణం, అయ్యంకి వెంకటరమణమ్మల చిత్రపటాలకు స్థానిక లైబ్రేరీలో శనివారం ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ టి.నిరూప మాట్లాడుతూ విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవరుచుకోవాలన్నారు.

గ్రంథాలయ ఉద్యమంతోనే సమాజ చైతన్యం

బుచ్చిరెడ్డిపాళెం : గ్రంథాలయ ఉద్యమం ద్వారా సమాజ చైతన్యం జరిగిందనే చారిత్రక సత్యాన్ని ప్రతిఒక్కరూ గుర్తించాలని బెజవాడ బుజ్జమ్మ జెడ్పీ బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎం ఎం.సుజాత అన్నారు. బుచ్చిరెడ్డిపాళెం శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ ఉద్యమకారులకు శనివారం నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాతూరి నాగభూషణం, అయ్యంకి వెంకటరమణయ్య, రంగనాథన్ వంటి మహనీయుల కృషి వల్లే గ్రంథాలయాల ఏర్పాటు జరిగిందన్నారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ కె.మంజులత, సాహితీవేత్త గండికోట సుధీర్‌కుమార్ పాల్గొన్నారు.

ఉద్యమకారులను స్మరించుకుందాం

కొడవలూరు: ప్రజల్లో విజ్ఞానం పెంపొందించేందుకు కృషి చేసిన గ్రంథాలయ ఉద్యమకారులను స్మరించుకుందామని లైబ్రేరియన్ జె.సురేంద్రరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని యల్లాయపాళెం గ్రంథాలయంలో గ్రంథాలయ ఉద్యమకారులు అయ్యంకి వెంకటరమణయ్య, ఎస్సార్ రంగనాథన్ చిత్రపటాలకు శనివారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాల ద్వారానే సమాజంలో చైతన్యం వస్తుందన్నారు. స్థానిక నాయకుడు శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

కొడవలూరులో..

స్థానిక గ్రంథాలయంలో ఉద్యమకారులు అయ్యంకి వెంకటరమణయ్య, పాతూరి నాగభూషణం, ఎస్సార్.రంగనాథన్‌ల జీవిత చరిత్రపై స్థానిక గిరిజన గురుకుల విద్యార్థులకు శనివారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ముఖ్య వక్తలుగా రిటైర్డ్ హెచ్‌ఎం వెంకయ్య, పంచాయతీ కార్యదర్శి మురళీకృష్ణలు గ్రంథాలయాల ఆవశ్యకతను విద్యార్థులకు తెలియజేశారు. విజేతలకు బహుమతుల ప్రదానం ఉంటుందని గ్రంథాలయ అధికారి కె.రాజేశ్వరి తెలిపారు.

- కోవూరు : స్థానిక లైబ్రేరీలో గ్రంథాలయ ఉద్యమకారులకు శనివారం నివాళులర్పించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ జే.సురేంద్రరెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.



కోవూరులో..



కొడవలూరు: యల్లాయపాళెంలో..



కొడవలూరులో వ్యాసరచన పోటీలు